# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం 28 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 4pm


## 17 కేజీల బరువు తగ్గాడు



ఆసీస్ పర్యటన కోసం

పేసర్ హర్షిత్ రాణా

క్రీడలు : పేసర్ హర్షిత్ రాణా తీవ్రంగా శ్రమించి 17 కేజీల బరువు తగ్గాడు. ఈ ఏడాది కోల్‌కతా నైట్ రైడర్స్ ఐపీఎల్ ట్రోఫీ నెగ్గడంలో ఆ జట్టు పేసర్ హర్షిత్ రాణా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రతిభే అతడిని నవంబర్ నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక బోర్డర్ గావస్కర్ ట్రోఫీకి ఎంపికయ్యేలా చేసింది. ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపికైన కొత్త ముఖాల్లో అతడు కూడా ఒకరు. మహమ్మద్ షమీ అందుబాటులో లేని కారణంగా బుమ్రా నేతృత్వంలోని పేస్ దళంలో సిరాజ్, ఆకాశ్ దీప్‌తో పాటు హర్షిత్ రాణాకూ చోటు దక్కింది. ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలో 8 వికెట్లతో హర్షిత్ ఆకట్టుకున్నాడు. అయితే.. షమీ రీప్లేస్‌మెంట్ కోసం వెతుకున్న టీమ్‌ఇండియాకు హర్షిత్ మొదటి ఛాయిస్ కాదట. గత ఐపీఎల్‌లో కోల్‌కతాకు ఆడిన హర్షిత్.. తన అద్భుత ప్రదర్శనతో ఆ జట్టు కోచ్ గౌతం గంభీర్ దృష్టిలో పడ్డాడు. అదే అతడిని టీమ్‌ఇండియాకు ఎంపికయ్యేలా చేసిందంటున్నారు పలువురు. ఇక ఈ యువ పేసర్ టీమ్‌ఇండియాకు ఎంపిక కావడం అంత ఈజీగా జరగలేదు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీకి ఎంపిక కావడం అతడి కల. ఇందు కోసం ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాడు. తీవ్రంగా శ్రమించి 17 కేజీల బరువు తగ్గాడు. ఐపీఎల్‌లో ప్రదర్శనతో శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్‌తో సిరీస్‌లకు జట్టులో హర్షిత్ రాణా ఉన్నప్పటికీ అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. ఇప్పుడు ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికయ్యాడు. 6.2 అడుగుల ఎత్తు ఉండే హర్షిత్ 140 కిలోమీటర్ల వేగంతో విసిరే బౌన్సర్లను ఆడటం బ్యాటర్లకు సవాలే.



# నీరు ఎవరు నింపమన్నారు?

### మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అంశాలపై విచారణ

హైదరాబాద్, ప్రజాస్వరం: కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా రిటైర్డ్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లను ఫైనల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ముఖ్యమంత్రి ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

- మినిట్స్ కు సంబంధించిన మూడు దస్త్రాల అందజేత
- కాళేశ్వరం డీపీఆర్ ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించారన్న వెంకటేశ్వర్లు
- కమిషన్ విచారణలో రిటైర్డ్ ఈఎన్ సీ వెల్లడి

# ఇది హేయమైన చర్య

### కానిస్టేబుళ్లను సర్వీసు నుంచి తొలగింపు

### అధికారం లేకుంటే ఒక మాట.. అధికారంకి వచ్చాక ఇంకో మాట

### 10 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి : మాజీ మంత్రి హరీశ్ రావు

పది మంది పోలీసులను సర్వీస్ నుంచి తొలగించడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని కోరితే కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి తొలగించడం హేయమైన చర్య అని విమర్శించారు. తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చానని, పోలీసుల కష్టాలు తనకు తెలుసని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఊదరగొట్టారని ఫైరయ్యారు.



**హైదరాబాద్, ప్రజాస్వారం :** అధికారం లేకుంటే ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఇంకో మాటనా అని హరీశ్ రావు ప్రశ్నించారు. పోలీసుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నారని, వారి ఆవేదన ఎందుకు అర్థం చేసుకోవడం లేదని నిలదీశారు. భేషజాలు పక్కన పెట్టి టీజీఎస్పీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలన్నారు. 10 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని చెప్పారు. సస్పెండ్ చేసిన 39 మంది కానిస్టేబుళ్లను కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### తీవ్రంగా ఖండిస్తున్నాం..

"ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని కోరితే 10 మంది కానిస్టేబుళ్లను సర్వీస్ నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హేయమైన చర్య. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. నేను పోలీసు కుటుంబం నుండి వచ్చిన. పోలీసుల కష్టాలు నాకు తెల్సు. ఇంట్లో భార్య, బిడ్డలు పడే బాధ నాకు తెలుసు.. అంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన రేవంత్ రెడ్డి గారు.. అధికారంలోకి వచ్చాక పోలీసుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నారు.? వారి ఆవేదన ఎందుకు అర్థం చేసుకోవడం లేదు. అధికారం లేకుంటే ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఇంకో మాటనా..? భేషజాలు పక్కన పెట్టి.. టీజీఎస్పీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని, 10 మందిని ఉద్యోగం నుండి తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకొని, సస్పెండ్ చేసిన 39 మంది కానిస్టేబుళ్లను కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# ట్రంప్ అధ్యక్షుడైతే రూ. 1.68 లక్షల కోట్లు ఆదా

**అంతర్జాతీయం :** డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే రూ.168 లక్షల కోట్లు ఆదా చేయొచ్చని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. బైడెన్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఫెడరల్ బడ్జెట్‌లో దుబారా ఖర్చులు ఉన్నాయని అన్నారు. ట్రంప్ అధికారంలోకి వస్తే ఎలాన్ మస్క్‌ను కొత్త ప్రభుత్వ పార్లమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ విభాగానికి అధిపతిగా నియమించనున్నట్లు కాంటర్ ఫిట్జ్‌గెరాల్డ్ చైర్మన్ హోవార్డ్ లుట్నిక్ ప్రకటించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతివ్వడమే కాకుండా పెద్దమొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు.

అయితే తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌కు కేబినెట్‌లో చోటిస్తానని.. అలా కాని పక్షంలో సలహాదారుడిగానైనా నియమించుకుంటానని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై మస్క్ సానుకూలంగా స్పందిస్తూ.. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ'కి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. కాగా, ప్రభుత్వ పెట్టుబడులను క్రమబద్ధీకరించి.. వృథాను అరికట్టేలా ఓ విభాగాన్ని ఏర్పాటుచేయాలని ట్రంప్‌తో ఇటీవల జరిగిన చర్చల్లో మస్క్ ప్రతిపాదించారు. ఇందులోభాగంగా ఆయన మస్క్‌ను



ప్రస్తుత ప్రభుత్వం అనవసర ఖర్చుల కోసం వృథా చేస్తున్న దాంట్లో ఎంత వరకు ఆదా చేస్తారు అని అడిగిన ప్రశ్నకు మస్క్ బదులిస్తూ దాదాపు రూ.168 లక్షల కోట్లు ఆదా చేయొచ్చని అన్నారు. రెట్టింపు ఖర్చులన్నీ ప్రజల నుంచి వసూలుచేస్తున్న ప్రత్యక్ష, పరోక్ష పన్నులే అన్నారు. దీనిద్వారా దేశ ప్రజల డబ్బే వృథా అవుతోందని.. ట్రంప్ ప్రభుత్వ సమర్థత విభాగం ఈ సమస్యను పరిష్కరిస్తుందని మస్క్ పేర్కొన్నారు. దీనివల్ల అమెరికా ఎప్పుడూ చూడని ఎత్తులకు చేరుకుంటుందన్నారు. ట్రంప్ మద్దతుదారులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనాలని, ముందస్తు పోలింగ్‌లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.


# ప్రసాదం నాణ్యమైందే

### హైదరాబాద్ ఫుడ్ లేబొరేటరీ స్పష్టం

### దేవస్థానానికి నివేదిక అందినట్లు ఈవో వెల్లడి

**ఖమ్మం:** భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి నివేదనకు, ప్రసాదాల కోసం వాడే ముడిసరకులు నాణ్యమైనవేనని హైదరాబాద్ ఫుడ్ లేబొరేటరీ నిర్ధరించింది. తిరుమలలో లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని వినియోగించారంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో భద్రాచలం ఆలయ కార్యనిర్వహణ అధికారిణి (ఈవో) ఎల్ రమాదేవి అప్రమత్తమయ్యారు. భద్రాచలంలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే ముడిసరకుల నమూనాలను హైదరాబాద్ ఫుడ్ లేబొరేటరీకి పంపించారు. క్షుణ్నంగా పరిశీలించిన అధికారులు.. ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, పప్పు దినుసులు, బియ్యం అన్నీ నాణ్యమైనవేనని నిర్ధరించారు. ఈ మేరకు దేవస్థానానికి నివేదిక అందినట్లు ఈవో రమాదేవి తెలిపారు.





# బుల్ జోష్.. ఖుష్

### సెన్సెక్స్ మళ్లీ 80000 ప్లస్

**ముంబయి, ప్రజాస్వరం:** స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం బలంగా పుంజుకున్నాయి. దేశీయ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా గత ఐదు సెషన్లలో నష్టాలు చవిచూశాయి. ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు, కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో బుల్ మళ్లీ పరుగులు పెట్టింది. ఫలితంగా సెన్సెక్స్ మళ్లీ 80వేల మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,300 పైన స్థిరపడింది.

# 50 మందికి అస్వస్థత

### మోమోస్ ఉదంతంలో పెరిగిన బాధితుల సంఖ్య

హైదరాబాద్, ప్రజాస్వరం : మోమోస్ తిని మహిళ మృతి చెందింది. తాజాగా 50 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరీ శంకర్ కాలనీలో శుక్రవారం జరిగిన సంతలో మోమోస్ విక్రయించారు. సింగాడకుంట బస్తీకి చెందిన రేష్మ బేగం (31)తో పాటు ఆమె పిల్లలు, ఆయా బస్తీల్లోని సుమారు 50 మంది వీటిని తిన్నారు. వీరందరికీ శనివారం నుంచి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో బంజారాహిల్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పలు ఆస్పత్రుల్లో చేరారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మోమోస్ తిన్నవారిలో దాదాపు 10 మంది మైనర్లు ఉన్నారు. రేష్మ బేగం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో ఆమె మృతిచెందారు. ఈ సంఘటనపై ఇప్పటికే బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మోమోస్ విక్రయించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. మోమోస్‌తో పాటు ఇచ్చే మయోనైజ్, మిర్చి చట్నీ కలుషితమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.